"ఏమిసార్. బిడ్డదా నాకు పెద్దకష్టం ఇప్పుడు. ఆ శబ్దం వినాలంటాడు. అప్పుడప్పుడు, అ శబ్దం వింటే బిడ్డకు బాగ ఉండును. బిడ్డకు బాగ ఉంటే, ఇంట్లో ఆండవాళ్ళకు బాగ ఉండును. నాకునూ బాగ ఉండును. నీకుదా ఆ శబ్దం బాగ పలుకుతాది. ఎక్కడ సార్, నీకు వచ్చింది, అదీ.నాకు రానంటుందే. అదియుం, ఒక పెరియ ఇదిదా సార్. అందరికి వస్తునా, ఏమి సార్? నువ్వుదా మంచి తెలివిగలవాడు. నీకుదా అది వస్తుంది. నాకు వస్తాదా! ఏల వస్తుంది?

"వచ్చిన విద్య పోరాదు సార్. అంటూనే ఉండవలె. చిన్న బిడ్డకు దినాము, నాలు, అంజి సార్లు, అది వినపెట్టితే, బిడ్డ బాగవుండును సార్. లేదా, బిడ్డకూడ నష్టమై పూడ్చును సార్. నువ్వుదా, మంచి వాడు. నీకు నేను చెపుతునా! ఇక్కడనే సౌక్యంగ ఉండుమీ. నీ సొంత వీడుదా ఇది. నీ తంబి ఏడిస్తే, అట్లా అరుస్తువాలేదా సార్! అంతదా. నువ్వు ఇక్కడనే ఉండి, బిడ్డను కాపాడబోతావు అనిదా నేను ఆండవాళ్ళకు చెపితిని. ఉండుమీ సార్........

"ఇంకా బిడ్డ పండనేదు. ఒక్కసారి ఆ శబ్దం అనుమీ సార్" అని ముగించాడు, మొదలియార్.

"బా" అని మొరిగాడు పాపం, శేఖరరావు.

---

# 12. సగం మంది

ఊరంతా అట్టుడికినట్టు ఉడికిపోతోంది. ఎవరినోట చూసినా, ఆ పత్రికను గురించిన మాటలే. ఇంతకూ సంగతి ఏమంటే, ఆ పత్రికా సంపాదకుడు, ఆ వారపు సంపాదకీయంలో "ఈ వూరి మ్యునిసిపల్ కౌన్సిలు సభ్యులలో సగంమంది శుంఠలు" అని రాశాడు. దానితో

మ్యునిసిపల్ కౌన్సిలు సభ్యులకే కాక, పూరందరికీ కూడా ఆ సంపాద కుడిమీద పట్టరానంత కోపం వచ్చింది.

ఆ సంపాదకుడు ఆ వూరివాడు కాడు. అది అతని అత్తవారి ఊరు. స్వగ్రామంలో చెలామణి కాలేక, అత్తవారి వూరికి వచ్చి, ఒక వార పత్రిక పెట్టుకున్నాడు. ప్రతివారం ఎవళ్ళనో వొకళ్ళను తిట్టడం ఒక పాలిసీగా పెట్టుకున్నాడు. తిట్లు తిన్నవాడూ, ఆ సంగతి ఆ నోటా ఆ నోటా విన్నవాడుకూడా ఆ పత్రిక కొని చదువుకోవడమే కాకుండా, ఉత్తరోత్తరా ఎందుకైనా పనికి వొస్తుందని భద్రంగా దాచి పెట్టుకొనే వారు. ఆ విధంగా, ఆ పత్రికకు చాలా చెల్లుబడి ఏర్పడింది. మొదట్లో ఆ ఊరివాళ్ళే చాలామంది ఆ పత్రికమీద అభిమానం చూపించారు. ఆ సంపాదకుడి దగ్గరకు వెళ్ళి, ఒకడి గుట్టు మరొకడు గోప్యంగా చెప్పి వచ్చేవాడు. చివరకు తనమీదగూడా ఒక వ్యాసం అచ్చు పడిన తరు వాత "ఛండాలపు గాడిద కొడుకు" అని సంపాదకుణ్ణి అడ్డమైన తిట్లూ తిట్టేవాడు.

ప్రజలు మెచ్చుకున్నా, తిట్టుకున్నా ప్రతివారమూ ఆ పత్రిక వేలకు వేలుగా అమ్ముడు పోతోంది. ప్రచారాన్నిబట్టి, ప్రకటనలు వస్తున్నాయి. బోలెడు డబ్బు వచ్చి అతనివొళ్ళో పడుతోంది.

కాస్త బాగుపడుతున్న వాణ్ణి చూస్తే, పదిమందికీ కళ్ళల్లోకారం కొట్టుకున్నట్టు ఉంటుంది. అంచేత, పూరందరూ సమయం దొరికితే అతన్ని అథః పాతాళలోకానికి త్రొక్కివెయ్యాలని వేచివున్నారు.

ఇప్పుడు దొరికింది సమయం. మునిసిపల్ కౌన్సిలు సభ్యుల్ని అతడు అంతమాట అన్న తరవాత, వాళ్ళంతా తలుచుకుంటే ఎంత పని అయినా చేస్తారు. ఒక కౌన్సిలరు ఇంటికి ఇంకొకడు చొప్పున అందరూ ఆ రోజంతా కాళ్లు కాలిన పిల్లులలాగ తిరుగుతూనే ఉన్నారు. వాళ్ళు అలా తిరగడం ప్రజలంతా చూస్తూనే ఉన్నారు. ఈ దెబ్బతో వీడి పని అయిందిరా అని చాలామంది ఆనందించారు.

మ్యునిసిపల్ కౌన్సిలర్లు అందరూ కలిసి మాట్లాడుకున్నారు. అక్కడనుంచి అంతా చైర్మను ఇంటికి వెళ్ళారు. చైర్మనుతో చాలా

సేపు మాట్లాడారు. చైర్మను, ప్రత్యేకం కబురు పంపించి పోలీసు సర్కిల్ ఇన్స్పెక్టరును పిలిపించాడు.

అందరూ కలిసి ఎంతోసేపు తీవ్రమైన ఆలోచన చేశారు. తర వాత, అందరూ వెళ్ళిపోయారు. చైర్మను, పోలీసు ఇన్స్పెక్టరూ కలిసి ఆ సంపాదకుని ఇంటికి వెళ్ళారు. అతడు వారిద్దరినీ కూచో మన్నాడు. మర్యాద చేశాడు.

చిట్టచివరకు చైర్మను తాను వచ్చినపని చెప్పాడు. "మీ వ్యాసానికి మ్యునిసిపల్ కౌన్సిలర్లందరికీ చాలా కోపంగా ఉంది" అన్నాడు.

"నేను సగంమందిమీద వ్రాస్తే, అందరికీ ఎందుకండి కోపం?" అని అడిగాడు సంపాదకుడు.

పోలీసు ఇన్స్పెక్టరు కొంచెం కలుగజేసుకొన్నాడు.

చిట్టచివరకు ఎలాగయితేనేం, వచ్చేవారపు సంచికలో సవరణ ప్రకటిస్తానని సంపాదకుడు ఒప్పుకున్నాడు.

ఈ సంగతి ఊరంతా ప్రాకింది. సవరణ ఏమనివేస్తాడో, తన తప్పుకు క్షమార్పణ ఎలా చెప్పుకుంటాడో అని ప్రతివాడూ ఎదురు చూస్తున్నాడు. వచ్చేవారపు సంచిక కోసం తహతహలాడుతున్నాడు.

చాలామంది ముందుగానే, ఏజెంట్లకు డబ్బుకట్టి తమ కాపీ రిజర్వు చేసుకున్నారు.

ఆ వారంరోజులూ, అదే ఆలోచనతో గడిపారు.

వారంరోజులు గడవడం ఎంతసేపు! మళ్ళీ వారం వొచ్చేసింది. మళ్ళీ పత్రిక వొచ్చేసింది.

అందరూ విరగబడి తలా వొక కాపీ కొనుక్కున్నారు.

సంపాదకీయం తీశారు. చదివారు.

"మన వూరి మ్యునిసిపల్ కౌన్సిలు సభ్యులలో సగంమంది ఘంతలని గతవారం ప్రకటించాము. మాది పొరపాటు.

"మన వూరి మ్యునిసిపల్ కౌన్సిలు సభ్యులలో సగంమంది ఘంతలు కారు!"

———